క్లుప్తంగా

నేడు జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం

రేగోడ్(మెదక్): మండల కేంద్రమైన రేగోడ్‌లోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద శుక్రవారం ఉదయం 10గంటల 30 నిమిషాలకు జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యార్థినికి సన్మానం



రాజేశ్వరీని సన్మానిస్తున్న తహసీల్దార్

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట మండలంలోని మడూర్ జెడ్పీపాఠశాల విద్యార్థిని రాజేశ్వరీ(570) మార్కులతో టెన్త్ మండల టాపర్‌గా నిలవడంతో తహసీల్దార్ మన్నన్, ఎస్ఐ నారాయణగౌడ్ సన్మానించారు. గురువారం పాఠశాల ఆవరణలో విద్యార్థినిని సన్మానించి అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ మండల టాపర్‌గా నిలవడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో వెంకట్రావుపల్లి మాజీ సర్పంచ్ నర్సయ్య, పీడీ నరేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధి హామీ జేఏసీ నాయకులు

అల్లాదుర్గం(మెదక్): ఉపాధి హామీ పథకంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఉద్యోగుల సంఘం జేఏసీ నాయకుడు సుధాకర్ డిమాండ్ చేశారు.సమస్యలు పరిష్కరించాలని అల్లాదుర్గం ఉపాధి హామీ ఉద్యోగులు ఎంపీడీఓ చంద్రశేఖర్‌కు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నెల నెలా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

నూతన తహసీల్దార్‌గా శ్రీనివాస్



నిజాంపేట(మెదక్): నిజాంపేట మండల నూతన తహసీల్దార్‌గా ఏ.శ్రీనివాస్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో సీసీఎల్ కమిషనర్ కార్యాలయంలో పని చేసి బదిలీపై నిజాంపేటకు వచ్చారు. మండలంలోని రెవెన్యూ సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు.


సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోండి

ఎంఈఓ ప్రతాప్ రెడ్డి



పాపన్నపేట(మెదక్): మండలంలో జరుగబోయే సమ్మర్ క్యాంపును విద్యార్థులు వినియోగించుకోవాలని ఎంఈఓ ప్రతాప్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 2 నుంచి 16 వరకు జరిగే క్యాంపులో 6 నుంచి 9 వ తరగతి వరకు చదివే విద్యార్థులు పాల్గొనాలని సూచించారు. శిబిరంలో డ్రాయింగ్, క్రాఫ్ట్, కరాటే, కుట్లు, అల్లికలు, ఆటలు నేర్పిస్తారని తెలిపారు. 15 రోజుల పాటు జరిగే ఈ క్యాంపునకు హాజరయ్యే విద్యార్థులకు స్నాక్స్‌తో పాటు, మంచి నీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. వీటిని నేర్పడానికి అర్హత గల ఇన్‌స్ట్రక్టర్లు తమను సంప్రదించాలని, వారికి రూ.3 వేలు చెల్లించనున్నట్లు పేర్కొన్నారు.

కార్మికులకు నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఎంపీఓ

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలో గ్రామ పంచాయతీ కార్మికులకు ఎంపీఓ కలీముల్లా గురువారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ప్రతి నెల కార్మికులకు పంచాయతీ తరపున నెలకు సరిపడ నిత్యావసర సరుకులు ఇవ్వాల్సి ఉందని అందులో భాగంగా పంపిణీ చేసినట్లు ఎంపీఓ తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.



పాపన్నపేట: బాచారంలో జెండా ఎగుర వేసిన కార్మికులు



చిన్నశంకరంపేట: మిర్జాపల్లిలో ఆటో యూనియన్ నాయకులు



తూప్రాన్‌లో పారిశుద్ధ్య కార్మికులు

ఘనంగా మేడే వేడుకలు

జిల్లాలో గురువారం మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఆయా ప్రాంతాల్లో జెండాలను ఎగుర వేశారు. కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. కార్మికుల హక్కులు, చట్టాల పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం రాజీలేని పోరాటం కొనసాగిస్తామని సీఐటీయూ నాయకులు చెప్పారు.



అల్లాదుర్గం విద్యుత్ కార్యాలయం ఎదుట..



శివ్వంపేటలో ..



నర్సాపూర్ మున్సిపల్ కార్యాలయం ఎదుట..



మనోహరాబాద్ మండలం దండుపల్లి వద్ద..



పెద్దశంకరంపేటలో జెండా ఎగురవేస్తున్న కార్మికులు

వారసత్వంగా ఉన్న భూమి మరొకరికి రిజిస్ట్రేషన్

రద్దు చేయాలంటూ తహసీల్దార్ కార్యాలయంలో బాధితుడి వినతి

అల్లాదుర్గం(మెదక్): తల్లి పేరుపై ఉన్న భూమి కుమారుడికి తెలియకుండా, కూతురి అండదండలతో మరొకరికి సేల్ డీడీ కింద రిజిస్ట్రేషన్ చేశారంటూ, ఆ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని గురువారం అల్లాదుర్గం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. వివరాల్లోకి వెళ్తే.. వట్‌పల్లి మండలం బిజిలీపూర్ గ్రామానికి చెందిన రామమ్మకు అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్ శివారులో రెండు ఎకరాల భూమి ఉంది. ఆమెకు కుమారుడు, కూతురు ఉన్నారు. ఈ భూమిని అమ్మేందుకు కూతురు ప్రయత్నిస్తుండటంతో కుమారుడు పోచయ్య తమకు సమాచారం లేకుండా భూమిని అమ్మవద్దని గతంలోనే కలెక్టర్, తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తనకు తెలియకుండా భూమిని మరొకరికి రిజిస్ట్రేషన్ చేశారంటూ మరోసారి పోచయ్య తహసీల్దార్ మల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. వారసత్వంగా తమకు రావల్సిన భూమి అమ్మినందుకు రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని కోరారు. ఈ విషయంపై తహసీల్దార్ మల్లయ్య మాట్లాడుతూ.. జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. భూమి వివాదంగా ఉన్న విషయం తెలియదన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతు కుటుంబ సభ్యులు

ప్రతిభను వెలికితీసేందుకే శిక్షణ శిబిరాలు

ఎమ్మెల్యే సునీతారెడ్డి



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని గోమారంలో వేసవి సెలవుల సందర్భంగా అండర్14 వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని ఎమ్మెల్యే సునీతారెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులలో నైపుణ్యం వెలికి తీసేందుకు ఈ శిబిరాలు దోహదపడతాయన్నారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేసుకోకుండా వాలీబాల్ శిక్షణలో పాల్గొని క్రీడాకారులుగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి దామోదర్‌రెడ్డి, నాయకులు చంద్రాగౌడ్, హన్మంతరెడ్డి, భిక్షపతిరెడ్డి, లక్ష్మణ్, నగేశ్, వెంకట్‌రెడ్డి, ముత్యంరెడ్డి, నవీన్, గంగిరెడ్డి, శైలేందదర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని కొత్తపేట, గొట్టిముక్కల గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాస్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాయిని మధు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతుల ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటుందని, రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు నారాగౌడ్, దాచ సంగమేశ్వర్, అనంతరావు, రవీందర్, సంగయ్య, దత్తు, అంజయ్య, సుదర్శన్, గోపాల్‌రెడ్డి, ఏపీఎం గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



గొట్టిముక్కులలో ప్రారంభిస్తున్న తహసీల్దార్

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

మనోహరాబాద్(తూప్రాన్): సీఎం సహాయనిధి పేదలకు వరమని కాంగ్రెస్ నాయకులు వీరబోయిన గోపాల్ అన్నారు. గురువారం మండలంలోని కాళ్లకల్ గ్రామానికి చెందిన లబ్ధిదారుడు మీనారెడ్డికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.57500 విలువైన చెక్కును మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి సహకారంతో అందజేశామని తెలిపారు. వీరి వెంట గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు సత్యనారాయణ, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేశంగుప్తా, రాజుయాదవ్, నాగరాజుయాదవ్, పోచయ్య తదితరులున్నారు.



చెక్కును అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సాఫ్ట్‌బాల్‌లో ఉచిత శిక్షణ

మనోహరాబాద్‌లో శిబిరం ఏర్పాటు

మనోహరాబాద్(తూప్రాన్): యువకులు, చిన్నారులు చదువుల్లోనే కాకుండా క్రీడలపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ నాయకులు మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం జిల్లా కలెక్టర్, యువజన క్రీడాధికారి ఆధ్వర్యంలో నిర్వహించే సాఫ్ట్‌బాల్ ఉచిత శిబిరాన్ని మనోహరాబాద్ క్రీడాప్రాంగణంలో ఆయన ప్రారంభించారు. ఈ శిబిరం ఈనెల 1 నుంచి 6 వ తేదీ వరకు కొనసాగుతుందని, విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం సాఫ్ట్‌బాల్‌లో జాతీయ స్థాయి జట్టుకు ప్రాతినిధ్యం వహించిన మండలానికి చెందిన సాయిసిరిని సన్మానించారు. వీరి వెంట సాఫ్ట్‌బాల్ జిల్లా క్యాషియర్ గోవర్ధన్‌గౌడ్, కోచ్ రవి, వెంకట్‌రెడ్డి, కుమార్‌గౌడ్, భిక్షపతి,పాల్గొన్నారు.



మనోహరాబాద్‌లో ఉచిత శిబిరంలో నాయకులు, సాఫ్ట్‌బాల్ క్రీడాకారులు

తవ్వారు..వదిలేశారు

రోడ్డు పక్కన ప్రమాదకరంగా గుంతలు

కౌడిపల్లి(నర్సాపూర్): రోడ్డు పక్కన కేబుల్ కోసం తవ్వి వదిలేయడంతో ప్రమాదకరంగా మారింది. మండల కేంద్రమైన కౌడిపల్లి వద్ద కూకుట్లపల్లి వెళ్లే దారిలో రోడ్డు ప్రక్కన ఇంటర్‌నెట్ ఫైబర్ కేబుల్ కోసం కాంట్రాక్టర్ భూమిని తవ్వి ఫైబర్‌లైన్ వేశాడు. నెలలు గడుస్తున్నా తవ్విన గుంతలను పూడ్చకుండా అలాగే వదిలేశాడు. దీంతో వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



అనుమతి లేకుండా ట్రాన్స్‌ఫార్మర్ మార్పు

శివ్వంపేట(నర్సాపూర్): సంబంధిత విద్యుత్ శాఖ అధికారుల అనుమతి లేకుండా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ పనులు నిర్వహించే ఓ కాంట్రాక్టర్ మరోచోటికి మార్చేశాడు. మండల పరిధి రత్నపూర్ గ్రామంలోని వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ పనులు నిర్వహించే ఓ కాంట్రాక్టర్ ఎలాంటి అనుమతులు తీసుకోకుండా మరోచోటికి మార్చాడు. వాస్తవానికి విద్యుత్ లైన్, ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలు మార్చాల్సి ఉంటే సంబంధిత శాఖకు డీడీ చెల్లించి అనుమతులు తీసుకుని మార్చాలి. అయితే ఇలా అనుమతి తీసుకోకుండా ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయాన్ని ఇన్‌చార్జి ఏఈ సాయిరాం దృష్టికి తీసుకెళ్లగా విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. మండలంలోని పలుచోట్ల కాంట్రాక్టర్లు ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

బాల్యవివాహాలను అరికట్టాలి

రామాయంపేట(మెదక్): బాల్య వివాహాలను అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యతని జస్టిస్ ఫర్ చిల్డ్రన్స్ విజన్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ (ఎన్జీఓ) జిల్లా ప్రాజెక్టు కోఆర్డినేటర్ రాజు సూచించారు. ఎన్జీఓ జిల్లా డైరెక్టర్ కై లాస్ సూచన మేరకు బాల్య వివాహాలపై గురువారం పట్టణంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. బాల్య వివాహాలు చేయడమంటే చిన్నారులపై అత్యాచారాలను ప్రోత్సహించడమే అవుతుందని తెలిపారు. అమ్మాయి మేజర్లు అయితేనే పెళ్ళి చేయాలని, అలా కాకుండా మైనర్లకు పెళ్లిళ్లు చేస్తే చట్టంలో కఠిన శిక్షలు ఉన్నాయని పేర్కొన్నారు.

పదోతరగతి విద్యార్థులకు సన్మానం



మనోహరాబాద్(తూప్రాన్): పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను పర్కిబండ గ్రామస్తులు గురువారం ఘనంగా సన్మానించారు. పర్కిబండ గ్రామ ఉన్నత పాఠశాలలో చదివి ఉత్తీర్ణత సాధించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఈ విద్యార్థుల పై చదువులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీనిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజుగౌడ్, గ్రామస్తులు లక్ష్మణ్‌సింగ్, కాయితయ్య, నాగరాజు, నాగభూషణం, రవి, సంతోశ్‌రెడ్డి, సాయికిరణ్ పాల్గొన్నారు.

బాలిక.. విజయ గీతిక

- పది ఫలితాల్లో రేగోడ్ 'కేజీబీవీ' సత్తా
- 18 ఏళ్లలో పదేళ్లు వంద శాతం ఉత్తీర్ణత

రేగోడ్(మెదక్): పదో తరగతి ఫలితాల్లో రేగోడ్ కేజీబీవీ సత్తా చాటింది. 18 ఏళ్లలో పదేళ్లు వంద శాతం ఉత్తీర్ణత సాధించి సక్సెస్ బాటలో పయనిస్తోంది. 2005లో అప్పుడు మంత్రిగా ఉన్న దామోదర రాజనర్సింహ రేగోడ్‌లో కేజీబీవీ పాఠశాలను ఏర్పాటు చేసి ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు తరగతులు ప్రారంభించారు. 2008లో పదో తరగతి వరకు అప్‌గ్రేడ్ చేశారు. 2008 నుంచి ఈ ఏడాది వరకు 18 ఏళ్లలో పదేళ్లు పదో తరగతిలో వందకు వంద శాతం ఉత్తీర్ణత సాధించి బాలికలు జిల్లాలోనే ఆదర్శంగా నిలిచారు.

రెండేళ్లు వరుసగా..

రెండేళ్లుగా వరుసగా వంద శాతం విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించగా, ఈ ఏడాది 35 మంది బాలికలకు 35 మంది పాసయ్యారు. రేగోడ్ మండలంలో ఆరు ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. కేవలం కేజీబీవీలో మాత్రమే వంద శాతం ఉత్తీర్ణత సాధించడంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. కార్పొరేట్‌కు దీటుగా ఇక్కడ డ్రా పౌట్ పిల్లలు బాగా చదువుకొని ఉత్తీర్ణత సాధించడంతో పాఠశాల హిస్టరీలో మరోసారి వెలుగులు నిండుకుంది. ప్రిన్సిపాల్‌తో పాటు మహిళా ఉపాధ్యాయులు ప్రణాళికతో పాఠ్యాంశాలు బోధించి విజయ బాట వేశారు. విద్యార్థినులను ఆరు గ్రూపులుగా ఏర్పాటు చేసి.. నెలలో నాలుగు మార్లు పరీక్షలు పెట్టి ప్రతిభను వెలికి తీశారు. వెనుకబడిన పిల్లలను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.



రేగోడ్ కస్తూర్బా పాఠశాల

టీచర్ కావాలని ఉంది



ఉపాధ్యాయుల కృషి ఫలితం లభించింది. పదిలో నాకు 533 మార్కులు వచ్చాయి. బాగా చదువుకుని ప్రభుత్వ టీచర్ కావాలన్నదే నా లక్ష్యం. టీచర్ అయితే విద్యార్థులను ఎంతో మందిని బావి భారత పౌరులుగా తీర్చిదిద్దే అవకాశం ఉంటుంది. ఆ దిశగా నా ప్రయత్నం కొనసాగిస్తా.

– అనూష, విద్యార్థి

ప్రణాళికతో ముందుకు



పాఠశాలలో పదో తరగతి విద్యార్థినులు 35 మందిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. నెలలో నాలుగు మార్లు పరీక్షలు పెట్టి ప్రతిభను వెలికి తీశాం. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి చదువులో ప్రోత్సహించాం. ప్రణాళికతో ముందుకు వెళ్లడంతో వంద శాతం ఉత్తీర్ణత సాధించాం.

– స్వయంప్రభ, ప్రిన్సిపాల్

సంక్షిప్త వార్తలు

• నేటి నుంచి వేంకటేశ్వర ఉత్సవాలు

పెద్దశంకరంపేట(మెదక్): గోదాసమేత లక్ష్మీవెంకటేశ్వర స్వామి వార్షికోత్సవానికి ఆలయం ముస్తాబైంది. శుక్ర, శనివారాలలో స్వామి వార్షికోత్సవం, కల్యాణ మహోత్సవం నిర్వహించేందుకు మాజీ డైరెక్టర్ విగ్రాం శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఆలయ ధర్మకర్త కేంద్ర ఎఫ్‌సీఐ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. శనివారం కల్యాణం, అనంతరం అన్నప్రసాదం, మంగళ హారతి నిర్వహించనున్నట్లు ధర్మకర్త తెలిపారు.

• సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

నర్సాపూర్: ముఖ్యమంత్రి సహాయనిధి పథకం పేదలకు వరమని ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. తన నివాసంలో గురువారం నర్సాపూర్, శివ్వంపేట, మాసాయిపేట మండలాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నాయకులు చంద్రాగౌడ్, అశోక్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆంజనేయులు, శైలేందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

• ఘనంగా గంగ బోనం ఊరేగింపు



టేక్మాల్ (మెదక్): టేక్మాల్ మండలంలోని బొడ్మట్‌పల్లి గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం లంధ జోగు కార్యక్రమంలో భాగంగా శివసత్తుల విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. సాయంత్రం గంగ బోనం ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఊర చెరువు వద్దకు వెళ్లి పటాలు వేసి ఒగ్గు కథతో గావు కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు.

• ఆర్టీసీ డిపోలో న్యాయవిజ్ఞాన సదస్సు

మెదక్ మున్సిపాలిటీ: ఆర్టీసీ డిపోలో గురువారం మేడే సందర్భంగా న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ ముఖ్యఅతిథిగా హాజరై అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడే అనే అంశంపై కార్మికులకు అవగాహన కల్పించారు. బాల కార్మికుల నిర్మూలన, చట్టాలు, హక్కుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఆర్ఎం శుభావల్లీ, డిపో మేనేజర్ సురేఖ, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రామశర్మ, అసిస్టెంట్ లేబర్ అధికారి రాజు, డీసీపీఓ కరుణాశీల, విటల్, న్యాయవాదులు శుభాష్‌చంద్రగౌడ్, సఖి సెంటర్ సభ్యులు పాల్గొన్నారు.

• నేటి నుంచి సమ్మర్ క్యాంపు

నర్సాపూర్ రూరల్: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం నుంచి వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ తారాసింగ్ తెలిపారు. మండలంలోని హెచ్ఎంలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మే 16 వరకు 15 రోజులపాటు ఈ శిబిరం ఉంటుందన్నారు. ఆరో తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులు తమ పేర్లు నమోదు చేసుకొని శిక్షణలో పాల్గొనాలని సూచించారు.

• సమ్మర్ క్యాంపులతో ప్రయోజనం

కొల్చారం(నర్సాపూర్): వేసవి సెలవుల్లో భాగంగా సమగ్రశిక్ష విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రారంభించిన యంగ్ ఇండియా సమ్మర్ క్యాంపులను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ సత్యనారాయణ రావు పేర్కొన్నారు. గురువారం మండలంలోని రంగంపేట ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సమ్మర్ క్యాంపును ఏర్పాటు చేశారు. క్యాంపులో విద్యార్థులకు వివిధ క్రీడల్లో వారి నైపుణ్యాన్ని వెలికితీసేలా నిర్వహణ కొనసాగుతుందని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీధర్ రెడ్డి తెలిపారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలతో పాటు స్నాక్స్‌ను సైతం అందజేశారు. కార్యక్రమంలో సీఆర్పీ రాములు, ఉపాధ్యాయులు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. లక్ష్మణ్
9502735264